సాక్షి పెద్దపల్లి

మంగళవారం । 7 । మార్చి । 2023



ఏఎల్పీ ప్రమాదానికి ఏడాది

సింగరేణి సంస్థ ఏఎల్పీలో గతేడాది మార్చి 7న జరిగిన ఘోర ప్రమాదం ఏపీఏ చరిత్రలోనే మొట్టమొదటి అతిపెద్ద సంఘటనగా నిలిచిపోయింది. 8లో▸



సహకార సంఘాల విస్తరణ

సహకార వ్యవస్థ బలోపేతానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిన నేపథ్యంలో జిల్లాలో సహకార పరపతి సంఘాలను(పీఏసీఎస్) మరింత విస్తరించనున్నారు. 8లో▸

గరిష్టం/కనిష్టం 36.0/20.0

వాతావరణం

ఉదయం వేళ ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

క్రమశిక్షణ, ఏకాగ్రతతో అన్నీ సాధ్యమే..



ప్రదర్శనలను తిలకిస్తున్న ఈడీ సునీల్‌కుమార్

జ్యోతినగర్: విద్యార్థులు క్రమశిక్షణ, ఏకాగ్రతతో ఉంటే జీవితంలో సాధించలేనిది ఏదీ ఉండదని ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సునిల్‌కుమార్ అన్నారు. సోమవారం పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని శ్రీచైతన్య స్కూల్‌లో ఏర్పాటు చేసిన సైన్స్ ఎక్స్‌పోను సందర్శించారు. పరికరాలతోపాటు స్వతంత్ర ఆలోచనలలు, కష్టపడేతత్వంతో సైన్స్‌ను గెలవవచ్చన్నారు. సైన్స్‌లో మంచి ప్రావీణ్యం సాధించి భావిశాస్త్రవేత్తలుగా ఎదగాలని సూచించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. దీప్తి మహిళా సమితి అధ్యక్షురాలు ఉషాకుమార్, జనరల్ మేనేజర్లు, ఉద్యోగ గుర్తింపు సంఘం నాయకులు, ప్రధానోపాధ్యాయురాలు నమ్రత పాల్గొన్నారు.

రెండు రోజులు నీటి సరఫరా బంద్

మంథని/సుల్తానాబాద్: జిల్లాలో మిషన్ భగీరథ నీటి సరఫరాను రెండురోజులపాటు నిలిపివేయనున్నారు. హెచ్‌ఎండబ్ల్యూ, ఎస్‌ఎస్‌బీ సబ్ స్టేషన్ మరమ్మతు, నిర్వహణ కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు మిషన్ భగీరథ గ్రిడ్ ఈఈ కె.పూర్ణచందర్ తెలిపారు. మూర్‌మూర్ వద్ద ఉన్న 160 ఎంఎల్‌డీ (మిలియన్ లీటర్ ఫర్ డే) నీటి శుద్ధి కేంద్రం వద్ద పనులు చేపడుతున్నందున ఈనెల 9 నుంచి మార్చి10 వరకు రామగుండం, పెద్దపల్లి, మంథని నియోజకవర్గ ప్రజలకు తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు సన్నద్ధం కావాలి



మాట్లాడుతున్న డీఈవో

సుల్తానాబాద్: పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ఉండాలని, వందశాతం ఉత్తీర్ణత సాధించాలని డీఈవో డి.మాధవి అన్నారు. పదో తరగతి విద్యార్థుల్లో భయాందోళన తొలగించేందుకు విద్యాశాఖ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని పద్మనాయక కల్యాణ మండపంలో నిర్వహించిన ప్రేరణ తరగతులకు హాజరయ్యారు. ఏప్రిల్‌లో జరిగే పరీక్షలకు కలెక్టర్ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని, ఇప్పటికే స్టడీ మెటీరియల్ పంపిణీ చేశామని, సంచార ప్రయోగశాల ద్వారా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. సమగ్ర శిక్ష సమన్వయ కర్త పీఎం షేక్, ఎంఈవో టి.సురేంద్ర కుమార్, శిక్షకులు సీహెచ్. ఆగయ్య, రామస్వామి, అనిత, మహేందర్ రెడ్డి, శశికాంత్ ఉన్నారు.

పేదలకు గుదిబండలా మోదీ సర్కార్



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

ఓదెల: ప్రధాని మోదీ పాలన పేదలకు గుదిబండలా మారిందని సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం అన్నారు. గ్యాస్ ధరల పెంపునకు నిరసనగా సోమవారం ఓదెలలో వినూత్న రీతిలో ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. పెట్రోల్, డీజిల్ ధరలను పెంచడంతోపాటు ప్రస్తుతం గ్యాస్‌ధరనూ పెంచారని గుర్తుచేశారు. సామాన్యులకు కట్టెల పొయ్యిలే దిక్కని సూచించారు. కార్పొరేట్ సంస్థలకు రూ.12 లక్షల కోట్లు మాఫీచేసిన ప్రధాని రైతులకు ఉచిత కరెంట్, సబ్సిడీపై బియ్యం, వృద్ధులకు పింఛన్లు ఎందుకు ఇవ్వలేకపోతున్నారని ప్రశ్నించారు. నాయకులు స్వామి, ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, ఆరెపల్లి మానస్‌కుమార్, చంద్రగిరి ఉదయ్, సూత్రాల స్వామి, నాగేందర్, రంగు శంకర్, పల్లె రాకేశ్, తుమ్మల సదయ్య, మహేశ్, రోహిత్, నది, అనిల్ పాల్గొన్నారు.

‘ఇళ్ల’ పంపిణీకి వేళాయే..!

- దరఖాస్తుల వివరాలపై క్షేత్రస్థాయిలో సర్వే పూర్తి
- గ్రామసభలు నిర్వహించి లక్కీ డ్రా ద్వారా ఎంపిక
- ఉగాదిలోగా లబ్ధిదారులకు అందించేలా ఏర్పాట్లు



జిల్లాకేంద్రంలో నిర్మాణం పూర్తయి పంపిణీకి సిద్ధంగా ఉన్న డబుల్ బెడ్ రూం ఇళ్లు

సాక్షి, పెద్దపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారులకు అందే అవకాశాలు కనిపిస్తున్నాయి. పెద్దపల్లి, రామగుండం, ఓడెల, అంతర్గాం, కాల్వశ్రీరాంపూర్ పరిధిలో పూర్తయిన 1494 ఇళ్లను ఉగాది పండుగ తరువాత పంపిణీ చేసేందుకు జిల్లా యంత్రాంగం వేగంగా కసరత్తు చేస్తోంది. ఇప్పటికే లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. ప్రధానంగా రెవెన్యూ బృందాలు సొంత ఇళ్లు లేని అర్హులను క్షేత్రస్థాయిలో పర్యటించి గుర్తించారు. వాటిపై అభ్యంతరాలను ఈనెల 13వరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయాల్లో స్వీకరించనున్నారు. కొత్తగా ఎవరైనా దరఖాస్తు చేసుకున్న వాటిని సైతం పరిగణనలోకి తీసుకుని తుది జాబితాను ప్రకటించనున్నారు. తదుపరి గ్రామసభ నిర్వహించి అందరిముందు లక్కీ డ్రా ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. ఆ తరువాత ప్రభుత్వ ఆదేశాలనుసారం తెలుగు కొత్త సంవత్సరంలో మంత్రులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో డబుల్ బెడ్రూం ఇళ్లలోకి గృహప్రవేశాలు చేయించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

దరఖాస్తుల జోరు..

జిల్లాలో పూర్తయిన డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీ చేయాలని మంత్రి ప్రశాంత్‌రెడ్డి అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆదేశించారు. దీంతో అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం.. మీసేవ కేంద్రాల్లో నిరుపేదలు దరఖాస్తు చేసుకోవాలని ప్రకటించారు. జిల్లాలో పూర్తయిన ఇళ్ల పంపిణీకి అధికారులు ఎంపిక మొదలుపెట్టడంతో నిరుపేదలు పెద్దఎత్తున దరఖాస్తు చేసుకున్నారు. పెద్దపల్లి, రామగుండం, శ్రీరాంపూర్, ఓదెల, అంతర్గాం మండలాల పరిధిలో దరఖాస్తులు స్వీకరించగా.. ఎక్కడా వెయ్యికి తక్కువ కాకుండా దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలో పూర్తయిన ఇళ్లకంటే మొదలు కాని ఇళ్లే ఎక్కువగా ఉండడంతో దరఖాస్తులు భారీగా వచ్చినట్లు తెలుస్తోంది.

మంథనిలో 74 ఇళ్లు పంపిణీ పూర్తి

మంథని మున్సిపాలిటీ పరిధిలో పోచమ్మవాడలో రూ.5.78కోట్లతో 92 డబుల్ బెడ్రూం ఇళ్లను నిర్మించారు. ఇందులో 74 ఇళ్లను జనవరి 23న మంత్రి కొప్పుల ఈశ్వర్ చేతులమీదుగా పంపిణీ చేశారు. మిగిలిన 18 ఇళ్లను మిగితావాటితో పంపిణీ చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

జిల్లాలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల వివరాలు ఇలా..

ప్రాంతం	పూర్తయినవి	దరఖాస్తులు
పెద్దపల్లి	375	2,079
ఓదెల	144	1,286
అంతర్గాం	60	1058
రామగుండం	675	7,672
కాల్వ శ్రీరాంపూర్	240	1,588

పారదర్శకంగా ఎంపిక



ప్రభుత్వ ఆదేశాలకు మేరకు అర్హులైన నిరుపేదలను గుర్తించేందుకు రెవెన్యూ సిబ్బంది క్షేత్రస్థాయిలో ఇప్పటికే పర్యటించారు. వాటిపై అభ్యంతరాలు ఉంటే ఈనెల 13వరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయాల్లో సంప్రదించవచ్చు. అనంతరం గ్రామసభలు నిర్వహించి లక్కీ డ్రా ద్వారా అందరి సమక్షంలో కులాల వారీగా ఎంపిక చేస్తాం.

– లక్ష్మీనారాయణ, అదనపు కలెక్టర్

సమస్యల పరిష్కార వేదిక ‘ప్రజావాణి’

- ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలి
- అడిషనల్ కలెక్టర్ లక్ష్మినారాయణ
- 44 దరఖాస్తుల స్వీకరణ



అర్జీలు స్వీకరిస్తున్న అడిషనల్ కలెక్టర్

పెద్దపల్లిరూరల్: ప్రజావాణిని సమస్యలు పరిష్కరించే వేదికగా నిలపాలని అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 44 దరఖాస్తులు స్వీకరించారు. ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యతనిచ్చి సత్వరమే పరిష్కరించాలని, ఆ సమాచారాన్ని ఫిర్యాదుదారులకు అందించి వారిలో నమ్మకాన్ని పెంచాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవన్నారు. సుల్తానాబాద్ మండలం గర్రెపల్లికి చెందిన రమేశ్ సర్వే నంబరు 45 ప్రభుత్వ భూమిలో నిర్మించుకున్న ఇళ్లను క్రమబద్ధీకరించాలని కోరారు. పోతారం గ్రామంలో చౌకధరల దుకాణాన్ని కేటాయించాలంటూ మంజుల కోరింది. కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మహిళా ఆరోగ్యంపై నజర్



- జిల్లాలో తొలివిడత మూడు ఆసుపత్రుల్లో సేవలు
- రేపటి నుంచి అందుబాటులోకి..

పెద్దపల్లిరూరల్: మహిళల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారిస్తోంది. ప్రతి మహిళా ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో అంతర్జాతీయ మహిళా దినోత్సవం (ఈనెల 8న) రోజున ఆరోగ్య మహిళ పేరిట మహిళా వైద్యులు, సిబ్బంది ఉండేలా ఆసుపత్రులను ప్రారంభిస్తోంది. తొలివిడతగా జిల్లాలో నియోజకవర్గానికో ఆసుపత్రిని ప్రారంభించేలా వైద్యారోగ్యశాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు. పెద్దపల్లి, రామగుండం పట్టణ ఆరోగ్యకేంద్రం, గద్దలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఈ ఆసుపత్రులు ఏర్పాటు కానున్నాయి. పెద్దపల్లి పట్టణానికి బస్తీ దవాఖానా మంజూరైనా ఇప్పటికీ ఏర్పాటు కాలేదు. దీంతో మహిళల కోసం ఆసుపత్రిని ఏర్పాటు చేసేందుకు చీకురాయి క్రాస్‌రోడ్డు వద్ద ఓ అద్దె గదిని తీసుకున్నారు.

8రకాల వైద్యసేవలు

మహిళల కోసం కొత్తగా ఏర్పాటయ్యే ఆసుపత్రుల్లో 8 రకాల వైద్యసేవలను అందుబాటులోకి తెస్తున్నారు. షుగర్, బీపీ, ఎనిమియా తదితర వ్యాధుల నిర్ధారణ పరీక్షలు చేస్తారు. సర్వైకల్, రొమ్ము కాన్సర్ స్క్రీనింగ్, సూక్ష్మపోషకాల గుర్తింపు, అయోడిన్ సమస్య, థైరాయిడ్, ఫోలిక్‌యాసిడ్ తదితర పరీక్షలు చేస్తారు. మూత్రకోశ వ్యాధులు, అండకోశ బుడగలు (సిస్టులు) బహిష్టు సమస్యలపై చికిత్స, కుటుంబ నియంత్రణ, రుతుస్రావ విరతి (మోనోపాజ్) నిర్వహణ, లైంగిక సంక్రమణ వ్యాధుల నిర్వహణ, బరువు నియంత్రణ, యోగా వ్యాయామంపై అవగాహన లాంటి సేవలను మహిళలకు ప్రత్యేకంగా అందిస్తారు.

మెరుగైన చికిత్సకోసం రెఫర్..

జిల్లాలోని యూపీహెచ్‌సీ, పీహెచ్‌సీలలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో మహిళలకు వైద్యపరీక్షలు నిర్వహించిన తర్వాత వారికి మరింత మెరుగైన చికిత్స అవసరమని గుర్తిస్తే పై ఆసుపత్రులకు రెఫర్ చేయనున్నట్లు వైద్యాశాఖ వర్గాలు తెలిపాయి.

సద్వినియోగం చేసుకోవాలి



జిల్లాలో మహిళలకు ఆరోగ్య సేవలందించేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసే కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి. మహిళలకు ఉన్న ఆరోగ్యపరమైన ఇబ్బందులకు అన్నిరకాల పరీక్షలు నిర్వహిస్తారు. ప్రస్తుతానికి ఓ డాక్టర్‌ను నియమించాం. వైద్య సిబ్బందిని డెప్యుటేషన్‌పై అందుబాటులోకి తెస్తాం.

– ప్రమోద్‌కుమార్, డీఎంహెచ్‌వో

పల్లెల అభివృద్ధిపై ట్రైనీ ఐఏఎస్‌ల పరిశీలన



కాల్వశ్రీరాంపూర్‌లో ఐఏఎస్‌లకు పుష్పగుచ్చం అందిస్తున్న నాయకులు

కాల్వశ్రీరాంపూర్/ఎలిగేడు/జూలపల్లి/ధర్మారం: ట్రైనీ ఐఏఎస్‌ల బృందం సోమవారం కాల్వశ్రీరాంపూర్ మండలంలో పర్యటించారు. పల్లెల్లో అభివృద్ధి, పథకాల అమలు, పంటల సాగు, పంచాయతీల నిర్వహణ, విద్య, ఆరోగ్యం, రహదారులు, శ్మశాన వాటికలు, వ్యక్తిగత మరుగుదొడ్లు, నిర్వహణ, స్వశక్తి మహిళల పొదుపు వంటి అంశాలపై ఆరా తీశారు. కాల్వశ్రీరాంపూర్, లక్ష్మీపురం, పందిల్ల, గంగారం గ్రామాల్లో పర్యటించి వివరాలు నమోదు చేసుకున్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్, జెడ్పీటీసీ వంగళ తిరుపతి రెడ్డి, ఎంపీడీవో రామ్మోహనాచారి, ఎంపీవో గోవర్ధన్ వారికి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. జూలపల్లి మండలం కుమ్మరికుంటలో పర్యటిస్తున్న ఐఏఎస్‌లు సోమవారం వివిధ పంటలు, రైతు రాజేశ్వర్ రెడ్డి ఆయిల్ పాం తోటను పరిశీలించారు. ఏఈవో శ్రీవాణి పంటల సాగు, పెట్టుబడి, సస్యరక్షణ, దిగుబడి, రైతుల ఆదాయంపై ఐఏఎస్‌లకు వివరించారు. ఎలిగేడు మండలంలోని సుల్తాన్‌పూర్‌లో పర్యటిస్తున్న అధికారులు ప్రాథమిక, జెడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలలను సందర్శించారు. కిచెన్‌గార్డెన్స్, బర్త్‌డే గార్డెన్, కంపోస్ట్ పిట్, మధ్యాహ్న భోజనం పరిశీలించారు. పాఠశాలకు స్వచ్ఛ పురస్కార్ అవార్డు రావడంపై ఆనందం వ్యక్తం చేశారు. ధర్మారం మండలంలోని పత్తిపాకలో పర్యటిస్తున్న ట్రైనీ అధికారులు రూట్‌మ్యాప్‌ను తయారు చేశారు. ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ, ఎంపీడీవో భీమ జయశీల, సహకార సంఘాల జిల్లా చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి, సర్పంచు బద్ద సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 25 కేంద్రాలు

పెద్దపల్లిరూరల్: జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు 25 పరీక్షా కేంద్రాలను గుర్తించామని, ఆయా కేంద్రాల్లో పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణ ఆదేశించారు. సోమవారం తన చాంబర్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈనెల 15 నుంచి ప్రారంభమయ్యే పరీక్షలు ఏప్రిల్ ఒకటి వరకు జరుగుతాయన్నారు. ఆరోగ్య సమస్యలు వస్తే వెంటనే వైద్యం అందించేలా సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రశ్నపత్రాలను ఠాణాల్లో భద్రపర్చాలని, కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో ఇంటర్ నోడల్ అధికారి కల్పన, డీఈఓ మాధవి తదితరులున్నారు.

గెజిటెడ్ అధికారుల సంఘానికి స్థలమివ్వండి

జిల్లాలో గెజిటెడ్ అధికారుల సంఘం కార్యాలయ నిర్మాణానికి స్థలం కేటాయించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్ అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందించారు. నాయకులు రమేశ్, వెంకటేశ్వర్లు, విజయ్‌పాల్‌రెడ్డి, రవికుమార్ తదితరులున్నారు.

పేదల కోసమే ఉచిత కోచింగ్ సెంటర్లు

- మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు



మాట్లాడుతున్న శ్రీధర్‌బాబు

మంథని: దూర ప్రాంతాలకు వెళ్లి శిక్షణ తీసుకునే ఆర్థిక స్థోమత లేని నిరుపేదలకు బాసటగా ఉండేందుకే స్థానికంగా ఉచితంగా కోచింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు మంథని ఎమ్మెల్యే డి. శ్రీధర్‌బాబు తెలిపారు. మన ఊరు–మన కోచింగ్ కేంద్రం ద్వారా గ్రూప్స్, ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాలకు శిక్షణ పొందుతున్న వారికి స్థానిక నరసింహ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీధర్‌బాబు పలు సూచనలు చేశారు. ఉచిత స్పోకెన్ ఇంగ్లిష్ నేర్పేందుకు అవసరమైన కసరత్తు జరుగుతోందన్నారు. పనికిరానివారి మాటలు పట్టించుకోవద్దని, ఉద్యోగం సాధించాలనే తపనతో ముందుకు వెళ్లాలని యువతకు సూచించారు. కార్యక్రమంలో పీజేఆర్ కోచింగ్ సెంటర్ అధినేత పి.జగదీశ్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సెగ్గెం రాజేశ్, చొప్పకట్ల హనుమంతరావు, దుద్దిళ్ల గణపతి తదితరులు పాల్గొన్నారు.

బీ–థర్మల్ కొనసాగింపుపై ఉద్యమ కార్యాచరణ



మాట్లాడుతున్న కౌశిక హరి

రామగుండం: బీ–థర్మల్ విద్యుత్ కేంద్రం కొనసాగింపుపై ఉద్యమ కార్యాచరణకు శ్రీకారం చుడతామని, ఇందులో పార్టీలకతీతంగా కలిసి వచ్చే వారి మద్దతు కూడగడతామని బీజేపీ నాయకుడు కౌశిక హరి అన్నారు. సోమవారం రామగుండంలో విలేకరులతో మాట్లాడారు. ఇంధన సరఫరా నిలిపివేసి, పునరుద్ధరణకు నిధులు కేటాయించకుండా మూసివేతకే ప్రాధాన్యతనిస్తున్న ప్రభుత్వ వైఖరిని ఎండగడతామన్నారు. హోలీ తర్వాత బీ – థర్మల్ విద్యుత్ కేంద్రం పరిరక్షణకు ఆందోళనలు చేస్తామన్నారు. ఆయన వెంట గంగాప్రసాద్, నిమ్మరాజుల రవి ఉన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే కొండగట్టు అభివృద్ధి

- అధికారంలోకి రాగానే మరిన్ని వసతులు కల్పిస్తాం
- బస్సు ప్రమాద బాధితులకు ఎలాంటి సాయమూ అందలేదు
- నాడు ఆ ఘటనపై సీఎం స్పందించకపోవడం సిగ్గుచేటు
- హాథ్ సే హాథ్ జోడోలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి



కొండగట్టు ఆలయంలో రేవంత్‌రెడ్డి పూజలు

కొండగట్టు/కొడిమ్యాల: కాంగ్రెస్ హయాంలోనే కొండగట్టు ఆలయ అభివృద్ధి జరిగిందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మరింత అభివృద్ధి చేస్తామని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. హాథ్ సే హాథ్ జోడోయాత్రలో భాగంగా సోమవారం కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆలయ ఆవరణలో మాట్లాడారు. ఘాట్‌రోడ్‌లో జరిగిన బస్సు ప్రమాదంలో మృతిచెందిన, క్షతగాత్రుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఎలాంటి సాయమూ అందలేదన్నారు. నాడు ఆ ఘటనపై సీఎం కేసీఆర్ స్పందించకపోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. ఇటీవల కొండకు వచ్చిన సీఎం ఆలయాన్ని అభివృద్ధి చేస్తానని వాగ్దానం చేశారని, తనకు నమ్మకం లేదన్నారు. 800 ఎకరాల స్థలంలో ఆలయాన్ని గొప్పగా అభివృద్ధి చేయవచ్చని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కొండగట్టు అంజన్న సన్నిధిలో భక్తులకు సకల వసతులు ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు.

పోతారం నిర్వాసితులను ఆదుకోవాలి

కొడిమ్యాల మండలం పోతారం పెద్ద చెరువు రిజర్వాయర్‌ను రేవంత్‌రెడ్డి సందర్శించారు. రిజర్వాయర్ నిర్మాణ సమయంలో కోనాపూర్‌లోని 135 ఇళ్లకు ఆర్‌ఆర్‌ఆర్ ప్యాకేజీ వర్తిస్తుందని ప్రభుత్వాధికారులు పేర్కొన్నారని, బీఆర్‌ఎస్ నాయకులు ఎంపీలు, ఎమ్మెల్యేలుగా ఎన్నికైనా ఈ సమస్య పరిష్కరించలేదన్నారు. రిజర్వాయర్ సమీపంలోని కొడిమ్యాల– కోరుట్ల రోడ్డుపై గల బుగ్గవాగుపై బ్రిడ్జి నిర్మించకపోవడంతో వర్షాకాలంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇప్పటికే ఇద్దరు ప్రాణాలు కోల్పోయారన్నారు. అంతకుముందు కొడిమ్యాలలో కాంగ్రెస్ జెండా ఆవిష్కరించారు. సాయంత్రం పాదయాత్ర పూడురు నుంచి గంగాధర వరకు కొనసాగింది. కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి, ములుగు ఎమ్మెల్యే సీతక్క, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, కాంగ్రెస్ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపెల్లి సత్యం, యూత్ కాంగ్రెస్ నాయకుడు నాగి శేఖర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నారాయణ, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రవిశంకర్‌పై చార్జ్‌షీట్ విడుదల

కొడిమ్యాల మండల కేంద్రంలో చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవి శంకర్‌పై కాంగ్రెస్ నాయకులు సోమవారం చార్జ్‌షీట్ విడుదల చేశారు. యోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, తొమ్మిదేళ్లయినా పోతారం రిజర్వాయర్ పనులు ఎమ్మెల్యే పూర్తి చేయలేకపోయారని ఆరోపించారు. సొంత గ్రామంలో రైతులపై కక్షగట్టిన కఠినాత్ముడని విమర్శించారు. మళ్లీ కాంగ్రెస్‌ను గెలిపిస్తేనే నియోజకవర్గ అభివృద్ధి జరుగుతుందన్నారు.

9న కరీంనగర్‌లో కాంగ్రెస్ కవాతు

గంగాధర(చొప్పదండి): ఎన్ని అడ్డంకులు సృష్టించినా కరీంనగర్‌లో ఈనెల 9న కాంగ్రెస్ కవాతు నిర్వహిస్తామని రేవంత్‌రెడ్డి అన్నారు. సోమవారం రాత్రి గంగాధర మండలంలోని మధురానగర్ చౌరస్తాకు పాదయాత్ర చేరుకుంది. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. కరీంనగర్‌లో కాంగ్రెస్ సభ నిర్వహించేందుకు సీపీ అనుమతి ఇవ్వడం లేదన్నారు. సభను అడ్డుకుంటే ముఖ్యమంత్రిని ప్రగతిభవన్ నుంచి బయటకు రానివ్వమని హెచ్చరించారు. కవాతు సభకు కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసిన కాంగ్రెస్ పార్టీని ఎందుకు ఓడించారని ప్రజలను ప్రశ్నించిన రేవంత్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి రాబోయే ఎన్నికల్లో అవకాశం ఇచ్చి రుణం తీర్చుకుందామని పిలుపునిచ్చారు. నేరెళ్ల బాధితుల విషయంలో ఎస్సీ కమిషన్ నివేదిక ఏడేళ్లయినా బయట పెట్టడం లేదని అన్నారు. ఎంపీ బండి సంజయ్, రాజ్యసభ సభ్యుడు సంతోష్ కుమార్ చేసిందేమీ లేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఈ ప్రాంతానికి చుక్క నీరు రాలేదన్నారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ కమీషన్ల కోసం కేసీఆర్ కుటుంబం పనిచేస్తోందని అన్నారు. ప్రాజెక్టుల పేరుతో దోచుకుంటోందని అన్నారు. ఇప్పుడున్న వరదకాలువ ద్వారానే మూడు వందల టీఎంసీల నీటిని తరలించే అవకాశం ఉన్నా.. కమీషన్ల కోసమే మరో కాలువ నిర్మిస్తున్నారని అన్నారు.

క్లుప్తంగా

'జెడ్పీ చైర్మన్ ఆరోపణలు మానుకోవాలి'


మాట్లాడుతున్న సదానందం

రామగిరి: మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబుపై జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అసత్యపు ఆరోపణలు మానుకోవాలని మాజీ జెడ్పీటీసీ చొప్పరి సదానందం హితవు పలికారు. ముత్తారం మండలం కేశనపల్లిలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. గత పాలకుల హయాంలో ఎలాంటి అభివృద్ధీ జరగలేదని మధు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. మోడల్ స్కూల్, కేజీబీవీ, జూనియర్ కళాశాల, టూటీఎంసీ రిజర్వాయర్ ఎప్పుడు పూర్తయ్యాయో గుర్తు చేసుకోవాలని సూచించారు. జేఎన్టీయూ, హార్టికల్చర్ పాలిటెక్నిక్, కేవీకే ఏర్పాటు చేసింది శ్రీధర్‌బాబేనని పేర్కొన్నారు. కుమార్, శ్రీనివాస్, బక్కతట్ల కుమార్, సాతిని రాకేశ్, బుర్ర రవీందర్, పాశం మొగిలి, సింగనవేన సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ స్టేట్‌లెవల్ ఓపెన్ కరాటే పోటీల్లో ప్రతిభ


సాధించిన పతకాలతో విద్యార్థులు

మంథని: కాజీపేటలో జరిగిన స్టేట్‌లెవల్ ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో మంథనికి చెందిన షోటోఖాన్ కరాటే విద్యార్థులు ప్రతిభ కనబర్చి మెడల్స్ సాధించినట్లు కరాటే ఇన్‌స్ట్రక్టర్ కొండ్ర నాగరాజు తెలిపారు. కటాస్ విభాగంలో ఎనిమిది గోల్డ్‌మెడల్స్, రెండు సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించారు. బీర ఆదిత్య తేజ, వడ్లకొండ శ్రీవిన్య, మిట్ట అశ్విత, తుమ్మల శ్రీ నిధి, బోనాల హారిక, నంద ఐశ్వర్య, ఎన్ అనిరుద్ గోల్డ్ మెడల్స్ సాధించగా, నిక్షిప్త్ సాయి, గురిజాల గగన్, సిల్వర్ మెడల్ సాధించినట్లు తెలిపారు. సేపురి మణిదీప్, బ్రాంజ్ మెడల్ సాధించినట్లు నాగరాజు పేర్కొన్నారు.

గెలుపే లక్ష్యంగా శ్రమించాలి

గోదావరిఖని: రాబోయే గుర్తింపు ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఐఎన్‌టీయూసీ కార్యకర్తలు శ్రమించాలని యూనియన్ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం తన నివాసంలో కోర్‌కమిటీ సమావేశంలో మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ యూనియన్ అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన కార్యాచరణ తదితర అంశాలపై లోతుగా విశ్లేషించారు. గోదావరిఖనిలో నిర్వహించే మహాసభ విజయవంతంపై కార్యాచరణ రూపొందించారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన హాత్‌సేహాత్ జోడో యాత్రను అన్నిగనులపై నిర్వహించి విజయవంతం చేయాలని, ఇందుకు కాంగ్రెస్ నేతలను ఆహ్వానించాలని నిర్ణయించారు. సమావేశంలో నాయకులు నర్సింహారెడ్డి, త్యాగరాజన్, ధర్మపురి, కాంపెల్లి సమ్మయ్య, గుమ్మడి కుమారస్వామి, వంగ లక్ష్మీపతిగౌడ్, జెట్టి శంకర్‌రావు, పసునూటి రాజేందర్, వడ్డెపల్లి దాస్, రాంశెట్టి నరేందర్, వికాస్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మూసివేత దిశగా బీ-థర్మల్..?!

- విద్యుత్ కేంద్రానికి బొగ్గు, ఆయిల్ నిలిపివేత
- సాంకేతిక లోపాలతో పెరుగుతున్న యూనిట్ ధర
- నిధుల కేటాయింపుపై మొగ్గు చూపని రాష్ట్ర ప్రభుత్వం


బీ-థర్మల్ విద్యుత్ కేంద్రం

రామగుండం: రామగుండంలోని 62.5 మెగావాట్ల విద్యుత్ సామర్థ్యం గల బీ-థర్మల్ కేంద్రం క్రమంగా మసకబారుతోంది. తరచూ సాంకేతిక లోపాలతో సతమతం అవుతున్న కేంద్రానికి 40రోజులుగా బొగ్గు, ఆయిల్ సరఫరా నిలిచిపోయింది. తద్వారా కేంద్రాన్నే మూసి వేయాల్సి వస్తుందని ఇంజినీర్లు, అధికారులు చర్చించుకుంటున్నారు. రాష్ట్రానికి వెలుగులు పంచాలన్న ఉద్దేశంతో రూ.14.8 కోట్లతో 1965 జూలై 19న బీ-థర్మల్‌కు శంకుస్థాపన చేశారు. క్రమంగా 500 మెగావాట్లకు విస్తరించాలని నిర్ణయించినప్పటికీ 62.5 మెగావాట్లకే పరిమితం చేశారు.

విద్యుత్ ఉత్పత్తిలో అనేక రికార్డులు

విద్యుత్ కేంద్రం ఆరంభం నుంచే వార్షిక విద్యుత్ ఉత్పత్తితోపాటు పీఎల్ఎఫ్ (ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్)లో అనేక రికార్డులు సాధించింది. ప్రతి ఆర్థిక సంవత్సరంలో 260 రోజులు నడిపించిన దాఖలాలు కూడా ఉన్నాయి. కేంద్రం ఏర్పాటు చేసి 50 ఏళ్లు గడుస్తుండడం.. తరచూ సాంకేతిక లోపాలు తలెత్తుతుండడంతో వాటి విడిభాగాలు ప్రస్తుతం లభ్యం కావడం లేదు. ప్రత్యామ్నాయ పరికరాలు బిగించి కేంద్రాన్ని నడిపిస్తున్నారు. అయినా ఈ ఏడాది ప్రారంభం నుంచే నాలుగు రోజులసాారి బాయిలర్ ట్యూబ్స్ లీకేజీ అవుతున్నాయి. టర్బయిన్‌లో సాంకేతిక సమస్యలు ఏర్పడుతున్నాయి. దీంతో ఉత్పత్తి కూడా 40మెగావాట్లకు పడిపోయి.. యూనిట్ ధర రూ.ఏడుకు పైగా పెరుగుతోంది.

కేంద్రం అనుమతిచ్చినా..

ప్రస్తుతం విద్యుత్ డిమాండ్ అధికంగా ఉండడంతో స్థానిక వనరుల లభ్యతతో ఉత్పత్తి వ్యయం తక్కువగా ఉన్న కేంద్రాలను మరో పదేళ్ల నడిపించేందుకు వెసులుబాటు కల్పిస్తూ సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ (సీఈఏ) ఉత్తర్వులు జారీ చేసింది. అయితే దీనిపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పందన లేకపోగా.. ఇంధన సరఫరా నిలిపివేసింది. జనవరి 26 నుంచి ఇంధన సరఫరా నిలిపివేయడంపై స్థానిక ఎమ్మెల్యే విద్యుత్‌శాఖ మంత్రి జగదీష్‌రెడ్డిని కలిసి విన్నవించారు. ఆయన సీఎండీని ఆదేశించినప్పటికీ ఇంధన సరఫరా కాలేదని ఇంజినీర్లు తెలిపారు.

మూసివేతకే ప్రభుత్వ నిర్ణయం..?

కాలం చెల్లిన విద్యుత్ కేంద్రం పునరుద్ధరణకు నిధులు కేటాయించలేమని విద్యుత్ సౌధ ఉన్నతాధికారులు నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే ఇంధన సరఫరా నిలిపివేసినట్లు సమాచారం. బొగ్గు, ఆయిల్ నిల్వలు పూర్తయ్యే వరకూ నడిపించి మూసివేయాలని ఓ డైరెక్టర్ స్పష్టం చేసినట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది. అదే జరిగితే ఇక బీ-థర్మల్ చరిత్ర కనుమరుగు కానుంది.

విద్యతో మహిళలకు ఉన్నత స్థానం

- రామగుండం పోలీస్ కమీషనర్ రెమారాజేశ్వరి


జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభిస్తున్న సీపీ రెమారాజేశ్వరి, ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని: మహిళలు సమాజంలో ఉన్నతంగా ఎదిగేందుకు విద్యేప్రాధాన్యమని రామగుండం సీపీ రెమా రాజేశ్వరి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం మార్కండేయ కాలనీలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మహిళల ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి ఆటల పోటీలు ప్రారంభించి మాట్లాడారు. మహిళలకు చదువుతోనే చైతన్యవంతులవుతారన్నారు. మహిళలను అన్నిరంగాల్లో ప్రోత్సహించాలని అప్పుడే స్త్రీకి సమాన హక్కుతో పాటు గౌరవం లభిస్తుందన్నారు. రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మాట్లాడుతూ.. పేదింటి ఆడబిడ్డల కోసం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ఒంటరి మహిళా ఆసరా పింఛన్లతో పాటు అనేక సంక్షేమ పథకాలను సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టారన్నారు. నియోజకవర్గంలోని మహిళలు ఆర్థికంగా రాణించాలనే లక్ష్యంతో వీహబ్ ద్వారా రూ.కోట్లల్లో రుణాలు అందిస్తున్నామన్నారు. మహిళల అభ్యున్నతికి పెద్దపీట వేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మేయర్ బంగి అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, నిర్వాహకులు మూల విజయారెడ్డి, కల్వచర్ల కృష్ణవేణి, తానిపర్తి విజయలక్ష్మి, తస్నీంబాను, జనగామ కవిత సరోజని, బాదె అంజలీదేవి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలకు నిర్వహించిన ఆటల పోటీలు అలరించాయి.

ఎస్సారెస్పీ కాలువలో బీటెక్ విద్యార్థి గల్లంతు

- బంధువుల ఇంటికి వచ్చిన యువకుడు
- ఈతకొడుతూ గల్లంతైన వైనం
- మరో యువకుడు క్షేమం


గల్లంతైన వ్యక్తి


ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ

మానకొండూర్: బంధువుల ఇంట్లో జరిగే దైవ కార్యక్రమానికి మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి కరీంనగర్‌కు వచ్చిన ఓ యువకుడు ఎస్సారెస్పీ కాలువలో పడి గల్లంతైన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మురారి రితికేష్ (23) యువకుడు ఐఐటీ బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. మహారాష్ట్రలోని నాందేడ్ ఖరగ్‌పూర్ నుంచి శనివారం రాత్రి కరీంనగర్‌లో ఉంటున్న తన అమ్మమ్మ, మేనమామల ఇంటికి చేరుకున్నాడు. రాత్రి బంధువుల ఇంట్లో నిర్వహించిన దైవకార్యక్రమంలో (దుర్గమ్మ కొలుపు) పాల్గొన్నాడు. ఉదయాన్నే నిద్రలేచి తన మేనమామ డోలిశ్రీనివాస్, డోలి ప్రసాద్, డోలి బద్రినాత్, డోలి జతిన్‌తో కలిసి మురారి రితికేష్ సరదాగా ఈతకు వెళ్దామని మానకొండూర్ మండలంలోని ఈదులగట్టెపల్లికి కారులో వెళ్లారు. గ్రామ శివారులో కల్లుతాగి సమీపంలోని ఎస్సారెస్పీ కాలువ ర్యాంపు వద్ద ఈతకొడుతుండగా కాలువలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో రితికేష్‌తో పాటు, జతిన్ (20) ఇద్దరు నీటిలో కొట్టుకుపోతుండగా అక్కడే ఉన్న శ్రీనివాస్, ప్రసాద్ జతిన్‌ను కాపాడారు. ఇంతలోనే రితికేష్ నీటిలో కొట్టుకుపోయి గల్లంతయ్యాడు. జతిన్ క్షేమంగా ప్రమాదం నుంచి బయట పడగా రుతికేష్ నీటిలో గల్లంతవడంతో మేనమామలు కన్నీటి పర్యంతమయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు సీఐ రాజ్‌కుమార్ సిబ్బంది ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఎస్సారెస్పీ కాలువ నీటిని నిలిపివేయించి జాలర్లతో గాలింపు చర్యలు చేపట్టారు. గాలింపు చర్యలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. రితికేష్ తండ్రి రాజేందర్ పదేళ్లక్రితం మృతిచెందగా, తల్లి భవానీ ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేస్తోంది. ఓ చెల్లి కూడా ఉందని సమాచారం.

మృత్యువుతో పోరాడి ఓడిన చిన్నారి

రామగిరి(మంథని): ముత్తారం మండలం ఓడేడ్‌కు చెందిన గాయత్రి (17నెలలు) చిన్నారి దాదాపు ఐదు రోజులు మృత్యువుతో పోరాడి తనవు చాలించింది. వివరాల్లోకి వెళితే.. కాల్వశ్రీరాంపూర్ మండలం తారుపల్లికి చెందిన అపర్ణను పదేళ్ల క్రితం ఓడేడ్‌కు చెందిన సరాల రమేశ్‌కు ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఇద్దరు కూతుళ్లు విష్ణుప్రియ, గాయత్రి. అపర్ణకు మానసిక స్థితి సరిగ్గా లేక పోవడంతో వరంగల్ ఆస్పత్రిలో చేర్పించారు. అప్పటి నుంచి మందులు వాడుతోంది. ఈ క్రమంలో గత నెల 28న ఇంట్లో ఎవరు లేని సమయంలో అపర్ణ(26) తనతో పాటు 17 నెలల కూతురు గాయత్రికి విషమిచ్చి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి చేర్పించగా అదేరోజు చికిత్సపొందుతూ అపర్ణ మృతిచెందింది. గాయత్రి కడుపులోకి విషం వెళ్లడంతో మృత్యుతో పోరాడి మృతిచెందింది.

రోడ్డు ప్రమాదంలో జూనియర్ అసిస్టెంట్‌కు గాయాలు


రోడ్డు ప్రమాదంలో గాయపడిన గురుమూర్తి

రామగిరి(మంథని): రామగిరి మండలం రత్నాపూర్ బస్టాండ్ సమీపంలో మంథని, పెద్దపల్లి ప్రధాన రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బొడ్డెళ్ల గురుమూర్తి జూనియర్ అసిస్టెంట్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ప్రత్యేక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాల జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న మంథనికి చెందిన గురుమూర్తి సెంటినరీకాలనీ నుంచి మంథని వైపు బైక్‌పై వస్తుండగా బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. దీంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు రామగిరి పోలీసులకు సమాచారం అందించారు. కానిస్టేబుల్ మల్లన్న సెంటినరీకాలనీలోని సింగరేణి డిస్పెన్సరీకి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

గ్రామాల్లో ట్రైనీ ఐఏఎస్‌ల పర్యటన

ధర్మారం/జూలపల్లి/ఎలిగేడు: ధర్మారం మండలంలోని పత్తిపాక గ్రామంలో, జూలపల్లి మండలంలోని కుమ్మరికుంటలో, ఎలిగేడు మండలంలోని సుల్తాన్‌పూర్‌లో ఆదివారం ట్రైనీ ఐఏఎస్ అధికారుల బృందం క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ధర్మారం గ్రామశివారులో ఏర్పాటుచేసిన పార్కును, నర్సరీలను, ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. జూలపల్లిలో డీ.83 ప్రధాన కాలువపైనున్న జల విద్యుత్ కేంద్రాన్ని సందర్శించారు. విద్యుత్ కేంద్రం పనితీరుపై ఆపరేటర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఎలిగేడులో స్వశక్తిసంఘాల మహిళలతో సమావేశమై గ్రామంలో చేస్తున్న పలు కార్యక్రమాలపై చర్చించారు. అనంతరం మహిళ సంఘం సభ్యులతో కలిసి బతుకమ్మ ఆడారు. స్థానిక సర్పంచ్ బద్దం సుజాత, పంచాయతీ కార్యదర్శి శిరీషా, జూలపల్లిలో జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి, మండల అభివృద్ధి అధికారి వేణుగోపాలరావు, సర్పంచ్ మేచినేని సంతోశ్‌రావు, ఎంపీటీసీ మల్లేశ్‌యాదవ్, కార్యదర్శి అంజలీధర్‌ను కలిసి గ్రామంలో చేపట్టిన పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ సౌకర్యం, రోడ్ల తదితర విషయాలను వివరాలు అడిగి రికార్డు చేసుకున్నారు. ఈ పర్యటనలో ట్రైనీ ఐఏఎస్‌లు అభిజిత్ శర్మ, నితేశ్ మిశ్రా, కమలేశ్ కుమార్, మిహిర్, రాహూల్ ఈజీఎస్ ఏపీవో సదానందం, ఏఈవో శ్రీవాణి, ఏఎస్‌వో ప్రకాశ్, ఏఎన్‌ఎం సరిత పత్తిపాక సింగిల్‌విండో చైర్మన్ నోముల వెంకటరెడ్డి, మండల అభివృద్ధి అధికారి రమేశ్, పంచాయతీ కార్యదర్శి శిరీషా, ఉపసర్పంచు బండారి శ్రీనివాస్, ఎంపీవో అనిల్‌రెడ్డి, సర్పంచ్ వెంకటేశ్వర్‌రావు, ఉపసర్పంచ్ హరీశ్‌గౌడ్, వివిధశాఖల అధికారులు, గ్రామస్తులు, స్వశక్తిసంఘాల మహిళలు పాల్గొన్నారు.

రైలెక్కిన స్కూల్ బస్సులు



స్కూల్ బస్సులు ఇలా వరుసగా వెళ్తున్నాయేంటి అనుకుంటున్నారా..! అది నిజమేగానీ.. అవి వెళ్లడం లేదు. వాటిని ఓ గూడ్స్ రైలు మోసుకెళ్తోంది. ఓ గూడ్స్ రైలు ఇలా స్కూల్ బస్సులతో వెళ్తుండగా పెద్దపల్లి రైల్వేస్టేషన్‌లో కాసేపు ఆగింది. దానిని చూసేందుకు ప్రయాణికులు ఆసక్తి కనబరిచారు. - పెద్దపల్లిరూరల్

'ఎంపీపీ దంపతులు శ్రీధర్‌బాబు కీలుబొమ్మలు'


మాట్లాడుతున్న నాయకులు

రామగిరి(మంథని): రామగిరి ఎంపీపీ ఆరెల్లి దేవక్క, ఆమె భర్త కొమురయ్య ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు ఆడిస్తున్న కీలుబొమ్మలని జెడ్పీటీసీ మ్యాదరవేణి శారద, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శంకేసి రవీందర్ అన్నారు. సెంటినరీకాలనీలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. పుట్ట మధుకు ప్రజల్లో ఉన్న ఆదరాభిమానాలను చూసి కుటిలయత్నాలు చేస్తున్నారని తెలిపారు. ఎంపీపీగా ఎన్నికైనప్పటి నుంచి దేవక్క దంపతులు తామే రాజులం, తామే మంత్రులం అన్నట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. వారి అరాచకాలకు అడ్డూఅదుపు లేకుండా పోయిందన్నారు. వారి స్వగ్రామంలోనే ఓ వికలాంగుడి భూమి కబ్జా చేశారని, ఓ ఇంటినీ ఆక్రమించుకున్నారని ఆరోపించారు. ఎంపీపీ దంపతులు మంచివారైతే ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఎందుకు సహకరించడం లేదో ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. ఎంపీపీ దంపతులను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడిని కోరుతున్నట్లు వివరించారు. వైస్ ఎంపీపీ శ్రీదేవి, మండల మహిళా అధ్యక్షురాలు బూక్యా ఆశాకుమారి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

'రక్తనాయక్' అవార్డు అందుకున్న యాదవరాజు


యాదవరాజును మెమెంటోలతో సత్కరిస్తున్న గవర్నర్ బండారు దత్తాత్రేయ

గోదావరిఖనిటౌన్: గోదావరిఖనికి చెందిన ఎన్‌వైపీ రాష్ట్ర అధ్యక్షుడు యాదవరాజు కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో రాష్ట్రవ్యాప్తంగా రక్తదాన శిబిరాలు నిర్వహించి, బాధితులకు సేవలందించినందుకు హర్యానా సీఎం మనోహర్ చేతులమీదుగా రక్తనాయక్-2023 అవార్డును అందించారు. కోవిడ్ సమయంలో నిఫా సహకారంతో ఎన్‌వైపీ సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అనేక స్వచ్ఛంద కార్యక్రమాలు నిర్వహించి బాధితులకు నిత్యావసర సరుకులు మాస్కులు, శానిటైజర్లు అందించారు. యాదవరాజు ఆధ్వర్యంలో సరోజాయాదవ్, తేజశ్రీ, కొలగాని శ్రీనివాస్, విద్యాసాగర్, కల్యాణి, కానిస్టేబుల్ కన్నె రాజుకు హర్యాణా సీఎం అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ హర్యానా రాజ్‌భవన్‌లో వీరిని శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. అవార్డు రావడంపై పలు సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

సదాశయ ఫౌండేషన్‌కు ప్రత్యేక పురస్కారం


అవార్డు అందుకుంటున్న శ్రావణ్ కుమార్

యైటింక్లయిన్‌కాలనీ: రాష్ట్రవ్యాప్తంగా సదాశయ ఫౌండేషన్ 14 ఏళ్లుగా చేస్తున్న అవయవ, శరీర, నేత్రదానలతో పాటు సామాజిక సేవలను గుర్తించి విజయవాడ వాసవీ క్లబ్, సూపర్ స్టార్, వాసవీ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సదాశయ ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రావణ్ కుమార్‌కు విజయవాడ నగర్ మేయర్ ఆదివారం అవార్డును అందించారు. 14 ఏళ్లుగా సదాశయ ఫౌండేషన్ చేస్తున్న అవయవ, శరీరీ నేత్రాదాలపై అవగాహన కల్పించడంతో పాటు పర్యావరణ పరిరక్షణ, ఉచిత వైద్యశిబిరాలు, రక్తదానాలు, అనాథలను చేరదీయడం వంటి అనేక సామాజిక సేవలకు గాను నందిఅవార్డుకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా అవార్డుకు ఎంపిక చేసిన వాసవీ క్లబ్ నిర్వాహకులు లలితకు సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు శ్రావణ్ కుమార్, సానా రామకృష్ణ రెడ్డి, లింగమూర్తి, రాజిరెడ్డి, డాక్టర్ భీష్మాచారి, చంద్రమౌళి, వాసు, రాజు కృతజ్ఞతలు తెలిపారు.

బెల్ట్ క్లీనింగ్ కార్మికులకు సెమీస్కిల్డ్ వేతనాలు చెల్లించాలి


విధులు నిర్వహిస్తున్న బెల్ట్ క్లీనింగ్ కాంట్రాక్ట్ కార్మికులు

రామగిరి(మంథని): సింగరేణి సంస్థ ఆర్జీ3, ఏపీఏ ఏరియాల్లో విధులు నిర్వహిస్తున్న బెల్ట్ క్లీనింగ్ కాంట్రాక్ట్ కార్మికులకు సెమీస్కిల్డ్ వేతనాలు చెల్లించాలని ఐఎఫ్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకన్న డిమాండ్ చేశారు. బెల్ట్ క్లీనింగ్ కాంట్రాక్ట్ టెండర్‌ను సెమీస్కిల్డ్ వేతనాలతోనే పిలవాలని కోరారు. సింగరేణి వ్యాప్తంగా ఓసీపీలు, సీహెచ్‌పీలు, అండర్ గ్రౌండ్ మైన్స్‌ల్లో విధులు నిర్వహిస్తున్న బెల్ట్ క్లీనింగ్ కార్మికులకు సెమీస్కిల్ వేతనాలు చెల్లించాలని చాలా ఏళ్లుగా లేబర్ అధికారులతో, సింగరేణి యాజమాన్యంపై ఒత్తిడి తెస్తున్న క్రమంలో అమలు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. కానీ సింగరేణి యాజమాన్యం ఇప్పటికి అమలు చేయకుండా కార్మికులను శ్రమదోపిడీకి గురిచేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులకు బూట్లు, హెల్మెట్ టెండర్‌లో కోడ్ చేయాలన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం బెల్ట్‌క్లీనింగ్ కాంట్రాక్ట్ కార్మికులకు సెమీస్కిల్డ్ వేతనాలతో పాటు బూట్లు, హెల్మెట్(టోపి) అందించే విధంగా టెండర్ పిలవాలని డిమాండ్ చేశారు.

రైలుకిందపడి మహిళ మృతి

- ప్రాణాలతో బయటపడ్డ ఏనిమిదేళ్ల బాలుడు
- సింగరేణి రైలులో కిక్కిరిసిన ప్రయాణికులు

ఓదెల: కాజీపేట్ నుంచి బల్లార్షా మధ్య పొత్కపల్లి రైల్వేస్టేషన్‌లో కాల్వశ్రీరాంపూర్ మండల పరిధిలోని ఆరెపల్లి జీపీ అనుబంధ గ్రామమైన మల్లయ్యపల్లెకు చెందిన శ్రీమంతుల భాగ్యమ్మ(55) మహిళ సింగరేణి రైలుకిందపడి ఆదివారం మధ్యాహ్నం మృతిచెందింది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. మల్లయ్యపల్లెకు చెందిన భాగ్యమ్మ తన ఎనిమిదేళ్ల మనవడితో పొత్కపల్లి నుంచి రవీంద్రఖనికి వెళ్లేందుకు రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. కిక్కిరిసిన ప్రయాణికులతో వచ్చిన రైలులో మనవడితో ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారీకింద పడడంతో కాళ్లుచేతులు తెగి అక్కడిక్కడే ప్రాణాలు కొల్పోయింది. చేతిలో ఉన్న మనవడిని మాత్రం బయటకు నెట్టివేయడంతో ప్లాట్‌ఫాంపై పడి ప్రాణాలతో బయటపడ్డాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు పొత్కపల్లి రైల్వేస్టేషన్లో రోదనలు మిన్నంటాయి. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఘటన స్థలాన్ని రామగుండం జీఆర్పీఎఫ్ పోలీసులు సందర్శించి కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. భాగ్యమ్మ మృతి వార్త తెలియడంతో స్వగ్రామైన కాల్వశ్రీరాంపూర్ మండలం మల్లయ్యపల్లెలో విషాద ఛాయాలు అలుముకున్నాయి.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

- ట్రాక్టర్ డ్రైవర్ల జీతాలు పెంచాలి
- కే.రాజన్న, జిల్లా కార్యదర్శి, సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ


మాట్లాడుతున్న రాజన్న

జ్యోతినగర్: రాష్ట్ర ప్రభుత్వం మోటారు రంగం కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటుచేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, జిల్లా కార్యదర్శి కే.రాజన్న డిమాండ్ చేశారు. ఆదివారం ఎన్టీపీసీ రామగుండం ఆటోనగర్‌లోని యూనియన్ కార్యాలయంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో పనిచేస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ల వేతనాలకు చట్టబద్ధమైన హక్కులు పూర్తిస్థాయిలో అమలు కావడం లేదన్నారు. యాజమాన్యాలు చెల్లిస్తున్న వేతనాలు కుటుంబ పోషణకు సరిపోవడం లేదని, కనీసం ఇంటి అద్దె, విద్యుత్ బిల్లులు, పిల్లల చదువులకు కట్టలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోజురోజుకు పెరుగుతున్న మార్కెట్ ధరలకు, ట్రాక్టర్ డ్రైవర్లు పొందుతున్న వేతనాలకు పొంతన లేకుండా పోతోందన్నారు. ట్రాక్టర్ డ్రైవర్లు కనీస వేతనాలు పొందేందుకు చట్టబద్ధమైన హక్కు కల్పించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో కార్మికులకు లబ్ధిచేకూరేలా చర్యలు తీసుకోవాలని, డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. సమావేశంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఈదునూరి నరేశ్, పెద్దపల్లి జిల్లా కాంట్రాక్టు కార్మికుల సంఘం ప్రధానకార్యదర్శి చిలుక శంకర్ సంఘం అధ్యక్షుడు కొమురయ్య, ప్రధాన కార్యదర్శి మురళి, తిరుపతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందక యువకుడి మృతి


రాజు (ఫైల్)

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): కూలీ పనులు చేస్తే తప్ప.. పూటగడవని ఆ కుటుంబాన్ని విధి వెంటాడింది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని సింగారం గ్రామానికి చెందిన సంపంగి రాజు మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్నాడు. కొద్ది రోజులుగా నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా కుటుంబ సభ్యులు ఇప్పటికే రూ.3 లక్షల వరకు వైద్యం కోసం ఖర్చుచేశారు. మెరుగైన వైద్యం అందించేందుకు స్తోమత లేకపోడంతో రెండు రోజుల కింద ఇంటికి తీసుకురాగా ఆదివారం మృతిచెందాడు. మృతుడికి తండ్రి మల్లయ్య, సోదరి ఉంది. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్ నర్సగౌడ్, ఎపీటీసీ మధు, గ్రామస్తులు కోరారు.